సంక్రాంతి పండగ.. సంప్రదాయ వేడుక


బెహరా కళాశాలలో గంగిరెద్దుల విన్యాసాలను తిలకిస్తున్న అధ్యాపకులు


నరవ ఇంజినీరింగ్ కళాశాలలో హరిదాసులతో ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్


పాలలో బియ్యం వేస్తున్న డైరెక్టర్ కృష్ణారెడ్డి

తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థులవస్త్రధారణ


సెయింట్ ఆన్స్ కళాశాలలో భోగి మంట వెలిగిస్తున్న అధ్యాపకులు


ఇండస్ట్రియల్‌కాలనీ జీవీఎంసీ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు


పతంగులు పట్టుకున్న విద్యార్థులతో కార్పొరేటర్ వెంకటరమేష్ తదితరులు

గోపాలపట్నం/సింధియా/మల్కాపురం : ఇంద్రధనస్సు ఇల చేరినట్టుగా రంగుల రంగవల్లులు.. భగభగలాడే భోగిమంటలు.. దివ్వెన ఎగిరే గాలిపటాలు.. డూ డూ బసవన్నల నృత్యాలు.. హరిదాసుల కీర్తనలు.. కొత్త బియ్యంతో తయారు చేసిన పొంగలి.. చూడచక్కగా బొమ్మల కొలువులు.. సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేసిన విద్యార్థులతో విద్యానంస్థలకు సంక్రాంతి శోభ వచ్చింది. మైదానాలు పల్లె ముంగిళ్లను తలపించాయి. పశ్చిమ నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు.

- నరవ బెహరా పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో సంబరాలను కళాశాల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బాజాల తరుణ్ కుమార్, ప్రిన్సిపాల్లు సుకన్య, లీలా ప్రసాద్, అనూష, వరలక్ష్మి పాల్గొన్నారు.
- నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సంక్రాంతి సబరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పట్నాయక్ ప్రారంభించారు.
- కొత్తపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రత్నమాల, నన్యాసిరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ఎన్ఏడీ రామకృష్ణ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను పాఠశాల డైరెక్టర్ రామకృష్ణా రెడ్డి ప్రారంభించారు. రవీంద్రుడు, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లోని శ్రీసాయిలత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామ్‌లాల్‌మిత్ర , ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి , ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.
- 61వ వార్డు పరిధి ఇండస్ట్రియల్‌కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పలు తరగతుల విద్యార్థులు తెలుగు సంప్రదాయ వస్త్రాలు ధరించి సందడి చేశారు. పాఠశాల మైదానంలో రంగు రంగు ముగ్గుల వేసి వాటిపై గొబ్బెమ్మలను నెలకొల్పారు. వాటి చుట్టూ చిన్నారులు సంక్రాంతి పాటలు ఆలపిస్తూ నృత్యం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి సత్యనారాయణ చిన్నారులను అభినందించారు.
- స్థానిక సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కోరమాండల్ సంస్థ ప్రజా సంబంధాల అధికారి యు.ఎ స్.శర్మ వేడుకలను తిలకించారు.

అప్రమత్తంగా ఉండాలి


గోపాలపట్నంలో ప్రచారం చేస్తున్న క్రైం పోలీసులు

గోపాలపట్నం: సంక్రాంతి పండగ నేపథ్యంలో క్రైం పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రయాణాల సమయంలో.. పండగలకు ఊళ్లకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. గోపాలపట్నంలోని పలు ప్రాంతాల్లో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఏఎస్ఐ గోవిందమ్మ జీపులో తిరుగుతూ మైక్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. విలువైన నగలు ఇంట్లో కాకుండా బ్యాంకుల్లో ఉంచాలని సూచించారు. ఏటీఎంలలో నగదు తీసేటప్పుడు మన దృష్టి మళ్లించి నగదు దొంగిలించే ముఠాలు ఉన్నాయన్నారు. అజాగ్రత్తగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. క్రెడిట్, డెబిట్ కార్డుల పిన్ నంబర్లు ఇతరులకు తెలియకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫేక్ మెసేజ్ లింక్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు. పండగ పూట ఇంటికి తాళాలు వేసి వెళితే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

ల్యాప్‌టాప్ దొంగలు అరెస్ట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని క్వార్టర్స్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన ఇద్దరు దొంగలను స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. ఈ నెల మొదటి వారంలో ఉక్కునగరంలోని రెండు క్వార్టర్స్‌లో వరుసగా జరిగిన దొంగతనాల్లో రెండు ల్యాప్‌టాప్‌లతో పాటు కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీ అయ్యాయి. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అచ్యుతాపురం మండలం దోసూరుకు చెందిన కొల్లి రాజునాయుడు (20), పరవాడ మండలం తానాంకు చెందిన బత్తి నిషాంత్‌లను క్రైం సీఐ సూర్యనారాయణ నేతృత్వంలో ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

రేష్మాయాదవ్‌కు అభినందన


రేష్మాయాదవ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్,ఉపాధ్యాయిలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన వాకాడ రేష్మాయాదవ్ హైదరాబాద్‌లో జరిగిన థాప్సి ఓపెన్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఆమె బుధవారం నగరానికి తిరిగి వచ్చింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు,పలువురు బాక్సర్‌లు ఘనంగా స్వాగతించారు. మల్కాపురంలో ఉపాధ్యాయు అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణకుమారి,ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కుమార్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన భరత్‌కు సన్మానం


భరత్‌ను అభినందిస్తున్న హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి భరత్‌ను యల్లపువాని పాలెం ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న భరత్ ఈ నెల 8 వరకు తెలంగాణ రాష్ట్రం చింతల్ మున్సిపల్ మైదానంలో జరిగిన 3వ తఫిసా ఓపెన్ నేషనల్ బాక్సింగ్ పోటీల్లో వెండి పతకం సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం భరత్‌తో పాటు ప్రోత్సహిస్తున్న తండ్రి రాజును అభినందించారు.

వైఎస్సార్‌టీయూసీ పాకెట్ డైరీ ఆవిష్కరణ


పాకెట్ డైరీని ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందిస్తున్న నాయకులు

సింధియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ యునైటెడ్ ఫ్రంట్(వైఎస్సార్‌టీయూసీ) కార్యాలయంలో పాకెట్ డైరీని బుధవారం యూనియన్ ప్రతినిధులు ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. క్యాలెండర్‌లో షిప్‌యార్డ్‌కు చెందిన వివిధ విభాగాల నెంబర్లు, వైఎస్సార్‌టీయూసీ నాయకుల సమాచారం, రైల్వే, విమాన సమాచారంతో పాటు ఉద్యోగులకు అవసరమయ్యే సమాచారం ఉంచినట్లు తెలిపారు.

సచివాలయాన్ని సందర్శించిన బెహరా


పింఛన్లపై ఆరా తీస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు 481 సచివాలయాన్ని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బుధవారం సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్ల పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గోపాలపట్నం పరిధిలో పింఛన్లు నిలిచి పోవడానికి కారణాలు తెలుసుకున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. అర్హత ఉన్న వారికి పింఛన్లు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అప్పలస్వామి, శంకరరావు రాజు పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు


అంగన్‌వాడీలో భోజనం పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

మల్కాపురం: అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు సూచించారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ డిపోలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ అంగనవాడీ సెంటర్‌కు తొలుత వెళ్లిన ఆయన గర్భిణులు,బాలింతల వివరాలు తెలుసుకొని వారికి అందిస్తున్న పౌష్టికాహారం పై ఆరా తీశారు. రికార్డులు, హాజరు పట్టిక ఆయన పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడారు. అనంతరం శ్రీఆంధ్రకాలనీ, కొత్త నక్కవానిపాలెం రేషన్ డిపోలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు పరిశీలించారు. ఈ రెండు డిపోల్లో కార్డు దారులకు సరకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్వో సూర్యప్రకాశరావు, డీటీవో చంద్రదళ, సివిల్ సప్లై డీఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

నడిచేదెలా?


ఫుట్‌పాత్‌పై అడ్డంగా పెట్టిన బోర్డు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రధాన మార్గంలో ఓ హోటల్ యజమాని పబ్లిసిటీ చేసే బోర్డును నలుగురు నడిచే ఫుట్‌పాత్‌పై అడ్డంగా పెట్టారు. దీంతో ఈ మార్గాన రాకపోకలు సాగించే వారు ఫుట్‌పాత్ దిగి రోడ్డుపై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.అధికారులు సమస్యపై స్పందించాలి.

– రామకృష్ణ, మల్కాపురం

నైపుణ్యం ఉంటేనే రాణింపు

ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా


వింటర్ వర్క్‌షాపును ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ జీజీఎం సిన్హా

పరవాడ: విద్యార్థులు తమ భవిష్యత్ ఉజ్వలంగా మార్చుకోవడానికి నైపుణ్యం పెంపొందించుకోవడానికి కృషి చేయాలని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. దీపాంజలినగర్‌లోని బాల భారతి పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన శీతాకాలపు వర్క్‌షాపును సంస్థ జీజీఎం సిన్హా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో తమ నైపుణ్యం పెంపొందించుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి, కెరీర్ ఎంపికలో మార్గ నిర్దేశం చేయడం సంస్థ లక్ష్యంగా పెట్టుకొందన్నారు. భవిష్యత్‌లో మంచి విజయవకాశాలు సాధించాలని జీజీఎం సిన్హా ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హా విద్యార్థులకు యోగా మ్యాట్‌లు, స్టేషనరీ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు, సీఎస్సార్ అధికారులు, దీపిక లేడీస్ క్లబ్ సభ్యుల బృందం, బాల భారతి పబ్లిక్ స్కూల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐక్యతతో కార్పొరేట్ సంస్థను తరిమికొట్టాం



ఎన్ఏడీ జి డబ్ల్యూ విభాగం కార్మికులతో మంత్రి రాజశేఖర్, మారయ్య

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపోలోకి దొడ్డిదారిన చొరబడేందుకు యత్నించిన కార్పొరేట్ సంస్థను తరిమి కొట్టడానికి నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్(ఎన్ఏఈఎస్ అండ్ డబ్ల్యూ) యూనియన్‌కు సహకరించిన కార్మికులకు ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అభినందనలు తెలిపారు. ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద మంగళవారం ఎన్ఏడీ జీడబ్ల్యూ విభాగం కార్మికులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థను అడ్డుకున్న కార్మికులపై కక్ష సాధించేందుకు యాజమాన్యం టార్గెట్ విధించిందన్నారు. ఆ టార్గెట్‌ను పూర్తి చేసి కార్మికుల శక్తిని యాజమాన్యానికి నిరూపించారని అభినందించారు. ఎన్ఏసీఎస్ అండ్ డబ్ల్యూ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ జీడబ్ల్యూ డివిజన్ కార్మికులు కృషి మరువలేనిదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెటట్టేందుకు యతిస్తే ఐక్య ఉద్యమాల ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంకల్పబలం ముందు ఏ శక్తి నిలవలేదన్నారు. మన సంస్థను మనం కాపాడుకునేందుకు ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగభూషణం, కొండబాబు, పి. రవి తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యుడు రాజాబాబుకు అవార్డు


ఎలక్ట్రో హోమియోపతి అవార్డు అందుకుంటున్న రాజాబాబు

గోపాలపట్నం: హోమియోపతి వైద్యుడు డాక్టర్ రాజాబాబుకు హోమియోపతి కౌన్సిల్ అవార్డు అందుకున్నారు. ఎలక్ట్రో హోమియోపతి సృష్టికర్త డాక్టర్ కౌంట్ సీజర్ మెట్టియ్ జయంతి సందర్భంగా ఈ అవార్డు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. 15 ఏళ్లుగా అందిస్తున్న సేవలను గుర్తించి ఆ సంస్థ ప్రతినిధులు ఈ పురస్కారం అందించారని డాక్టర్ రాజాబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు


స్టిక్కర్లు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

మల్కాపురం: రహదారి భద్రత నియమాలు పాటించి ప్రయాణాలు సాగిస్తే సాఫీగా గమ్యం చేరుకోవచ్చునని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అన్నారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా నిర్వహించనున్న రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎన్జీవో రీజినల్ కమిటీ రూపొందించిన కరపత్రాలను జేసీ విశ్వనాథన్ బుధవారం ప్రారంభించారు. అతి వేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా రోడ్డు సేఫ్టీ ఎన్జీవో రీజనల్ అధ్యక్షులు,వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి సూకరెడ్డి,పొట్టిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన భేష్


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శేషకుమారి

కంచరపాలెం: కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులోని డాక్టర్ రామారావు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మెడికవర్ హాస్పిటల్స్ సంయుక్తంగా గైనకాలజిస్ట్ డాక్టర్ శేషకుమారి అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 280 మంది స్థానికులు వైద్య సేవలు పొందారు. బీపీ, సుగర్, గుండె సంబంధిత వ్యాధులు, చెవి, గొంతు, ముక్కుకు సంబంధించిన పరీక్షలు చేసి సూచనలిచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషకుమారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్య సమస్యలుంటే తక్షణమే వైద్య సేవలు పొందాలని సూచించారు. పలు వ్యాధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరిపై వైభవంగా కూడార్రై ఉత్సవం

శాస్త్రోక్తంగా ఎదురు సన్నాహోత్సవం


అప్పన్న ఉత్సవమూర్తులకు ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


గంగధార వద్ద గోదాదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం కూడార్రై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఈనెల 14న భోగిరోజు సాయంత్రం జరిగే గోదా రంగనాథుల కల్యాణోత్సవానికి సంబంధించి ఎదురు సన్నాహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గోదాదేవి ఉత్సవమూర్తిని ఆలయంలో తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అధిష్ఠింపజేసి విశేషంగా అభిషేకాలు చేశారు. అనంతరం అక్కడ అమ్మవారిని విశేషంగా అలకరించి పల్లకిలో ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద అధిష్ఠింపజేశారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో తీసుకొచ్చి నీలాద్రిగుమ్మం వద్ద ఆస్థానమండపంలో వేంచేయజేశారు. ఎదురుసన్నాహోత్సవాన్ని వైభవంగా జరిపారు. అక్కడి నుంచి గోదాదేవిని, స్వామివారిని పేటతిరువీధిగా తీసుకొచ్చి గోదాదేవి ఆలయం వద్ద అధిష్ఠింపజేశారు. విశేష పాశుర విన్నపం, సాత్తుమొర్రై, ధనుర్మాస పూజలు జరిపారు. ఈ సందర్భంగా అర్చకులు నృత్యాలు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పూజలు నిర్వహించారు.

ముగిసిన రాపత్తు ఉత్సవాలు


పరమపదవాసుడి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై పదిరోజులుగా నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజు వరాహ లక్ష్మీనృసింహస్వామి పరమపదవాసుడిగా దర్శనమిచ్చాడు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా ముస్తాబు చేసి పల్లకిలో అధిష్ఠంపజేశారు. మరో పల్లకిలో ఆళ్వారులను వేంచేయజేసి సింహగిరి మాడ వీధుల్లో రాత్రి తిరువీధి నిర్వహించారు. అనంతరం స్వామిని ఆస్థానమండపంలో అధిష్ఠంపజేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పూజలు చేశారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక శ్రీనగర్‌లోని గుడివాడ గురునాథ కాలనీ, కనకదుర్గ గుడి వద్ద నివాసం ఉంటున్న నారమాల రమణ (49) గతంలో స్క్రాప్ వ్యాపారం, తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. వ్యాపారం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆటోనగర్ డీ-బ్లాక్ పాత అన్న క్యాంటీన్ వద్ద గల ఆటోనగర్ పార్క్‌లోని మామిడితోటలో మంగళవారం రాత్రి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బుధవారం వేకువ జామున చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు, గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు.

699వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 699వ రోజుకు చేరాయి.ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరుపతికి కాలినడకన వెళ్లి మొక్కు తీర్చుకుని వచ్చిన ఉక్కు కార్మికులు సయన బాబు, గంటల రామారావును దీక్షా శిబిరం వద్ద సత్కరించారు.